సాక్షి గుంటూరు

ఆదివారం । 13 । జూలై । 2025



20న మహంకాళీ బోనాల ఉత్సవాలు

దుగ్గిరాల: ఆషాఢ మాసం సందర్భంగా మండలంలోని కంఠంరాజు కొండూరులో గల మహంకాళీ అమ్మవారికి 20న బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నారు.



వెండి బిస్కెట్ల సమర్పణ

మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన తాళం నితిన్ కుమార్ కుటుంబ సభ్యులు 2.3 కిలోల వెండిని శనివారం సమర్పించారు.



సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఏపీ ఈఏపీసెట్-2025(ఎంపీసీ స్ట్రీమ్) పరీక్షలో ర్యాంకులు పొందిన స్పెషల్ కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ శనివారం ప్రారంభమైంది.

న్యూస్‌రీల్

గుంటూరు నగరపాలక సంస్థకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డ్

నెహ్రూనగర్ : కేంద్ర ప్రభుత్వం వివిధ కేటగిరీల్లో శనివారం ప్రకటించిన సర్వేక్షణ్ అవార్డుల్లో గుంటూరు నగరం స్థానం సాధించిందని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ సూపర్ లీగ్ సిటీస్ విభాగంలో విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాలు ఎంపిక అయ్యాయని పేర్కొన్నారు. ఇందులో 3 నుంచి 10 లక్షల జనాభా ఉన్న నగరాల్లో గుంటూరు నగరం స్థానం దక్కించుకుందని వెల్లడించారు. న్యూ ఢిల్లీలోని విద్యా భవన్‌లో ఈ నెల 17న రాష్ట్రపతి అవార్డులను అందిస్తారని, తనతో పాటు మేయర్ వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో నగరం నిలవడానికి కృషి చేసిన ప్రజారోగ్య సిబ్బంది, అధికారులు, ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ కార్యవర్గం ఎన్నిక



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎంఎం షరీఫ్, డి. యల్లమందరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాత గుంటూరులోని పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన జీటీఏ ఉమ్మడి గుంటూరుజిల్లా సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోశాధికారిగా రమాదేవి, అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా చలపతిరావు, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏ.విజయకుమార్, సంయుక్త కార్యదర్శిగా పి. రమేష్‌బాబు, బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏ. దశరథ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా ప్రశాంత్‌బాబు నియమితులయ్యారు.

ఇసుక అక్రమ తవ్వకాలను సహించం

మంత్రి మనోహర్



కొల్లిపర: ఇసుక అక్రమ తవ్వకాలను సహించేది లేదని, సొంత పార్టీ వాళ్లయినా అక్రమానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కృష్ణానది నుంచి ఇసుక తరలింపులో అక్రమాలు జరుగుతున్నాయని ఆయన దృష్టికి రావడంతో శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ప్రారంభంలో ఇసుక నిల్వ.. ప్రస్తుతం అనే అంశాలపై రేపటిలోగా తనకు నివేదికను అందించాలని ఆదేశించారు. నదిలో అర్ధరాత్రి మిషన్లతో తవ్వకాలు జరుగుతున్నారని తనకి సమాచారం వచ్చిందని, దీనిపై సమాధానం చెప్పాలని రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులను ఆయన ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోయేసరికి వారిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ తవ్వకాలు విషయం తేలే వరకు డంపింగ్ యార్డ్ నుంచి ఇసుకను తరలించవద్దని అధికారులను ఆదేశించారు.

పులిచింతలకు 20,077 క్యూసెక్కులు విడుదల



సత్రశాల (రెంటచింతల): సత్రశాల వద్ద కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రెండు యూనిట్ల నుంచి, రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా మొత్తం 20,077 క్యూసెక్కులు దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు ఏపీ జెన్‌కో ప్రాజెక్టు డ్యామ్ ఈఈ సుబ్రమణ్యం, ఏడీఈ ఎన్.జయశంకర్ శనివారం తెలిపారు. విద్యుత్ ప్రాజెక్టులోని రెండు యూనిట్ల ద్వారా 8,757 క్యూసెక్కులు దిగువనున్న పులిచింతలకు విడుదల చేసి 1.874 ఎంఎం విద్యుత్ ఉత్పత్తి నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు 2 క్రస్ట్‌గేట్ల ద్వారా 11,320 క్యూసెక్కులు వరద నీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. నీటిమట్టం ప్రాజెక్టు పూర్తి స్థాయి 75.50 మీటర్లకు నీరు చేరుకుందని, రిజర్వాయర్‌లో గరిష్ట స్థాయిలో 7.080 టీఎంసీలు నిల్వ ఉందని తెలిపారు.

మోసాల చంద్రబాబు

- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ధ్వజం
- చేబ్రోలులో వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం
- బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తదితరులు

చేబ్రోలు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దుర్మార్గమైన పాలనను కొనసాగిస్తున్నదని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. చేబ్రోలులోని పరిమి సత్యనారాయణ కల్యాణ మండపంలో శనివారం వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అధ్యక్షత వహించిన సమావేశానికి పొన్నూరు, పెదకాకాని, చేబ్రోలు మండలాలల నుంచి అధిక సంఖ్యలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్, సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చి మోసగించిందని ఆరోపించారు. చంద్రబాబు ఏడాది పాలన సందర్భంగా సుపరిపాలన తొలి అడుగు అంటూ మొదలు పెట్టారని, అది మోసపూరిత పాలను తొలి అడుగు అని విమర్శించారు. కార్యక్రమంలో చేబ్రోలు, పొన్నూరు ఎంపీపీలు కొక్కిలగడ్డ సాహితి, భవనం పద్మలీల, పెదకాకాని జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, చేబ్రోలు, పెదకాకాని, పొన్నూరు పార్టీ మండల అధ్యక్షులు ఆళ్ల శ్రీరామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మురళీకృష్ణ, పార్టీ నాయకులు ఎస్. రూత్‌రాణి, ఆకుల వెంకటేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాసరావు, షేక్ నాజర్, యండేటి వెంకటసుబ్బయ్య, తాటిబోయిన వేణుగోపాల్, చందు సాంబశివరావు, బీమవరపు విజయలక్ష్మి, పోలేశ్వరరావు, చేబ్రోలు నాగేశ్వరరావు, అల్లం వెంకట్రామయ్య, దంతాల శ్రీనివాసరావు, వెలగా కృష్ణ, కామినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శృతి మించిన నరేంద్ర అరాచకాలు



మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అరాచకాలు శృతి మించి హత్యారాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. పోలీసుల సహకారంతో నియోజకవర్గంలో అకృత్యాలు ఎక్కువయ్యాయని మండిపడ్డారు. మన్నవ గ్రామ సర్పంచ్ నాగమల్లేశ్వరరావుపై పట్టపగలు ప్రధాన రహదారి పక్కన పాశవికంగా ఇనుపరాడ్లతో దాడి చేయడం వెనుక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాత్ర ఉందని ఆరోపించారు. మినీ మహానాడులో నరేంద్ర మాట్లాడిన మాటలే ఇందుకు నిదర్శనమని తెలిపారు. టీడీపీ హత్యా రాజకీయాలు, అరాచకాలను నిరసిస్తూ అవసరమైతే గ్రామగ్రామాన పాదయాత్ర చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉండి వారిని కాపాడుకుంటానని చెప్పారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ ద్వారా పార్టీ శ్రేణులు గ్రామగ్రామాన ప్రతి ఇంటికీ వెళ్లి టీడీపీ మోసాలను గుర్తు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వెబ్-ఆప్షన్ల నమోదుకు వేళాయె !

- ఇంజినీరింగ్ ప్రవేశాల్లో కీలక దశ ప్రారంభం
- రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన విద్యార్థులకు అవకాశం
- 18వ తేదీ వరకు కొనసాగనున్న వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 36 కళాశాలల్లో 30,240 సీట్లు



వెబ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు నమోదు చేసుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్ ప్రవేశాల్లో కీలక దశ ఆదివారం ప్రారంభం కానుంది. కన్వీనర్ కోటాలో అడ్మిషన్ పొందేందుకు, కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. మేలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీసెట్-2025) జరిగింది. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో భాగంగా ఆదివారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులంతా దీనికి సిద్ధం కావాలి. ఈఏపీసెట్ నోటిఫికేషన్‌లో పొందుపర్చిన జాబితాలో పేర్కొన్న విధంగా ధ్రువపత్రాల పరిశీలన విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులు వెబ్ ఆప్షన్లకు సన్నద్ధం కావాలి. ఇప్పటికీ రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులకు ఈనెల 16 వరకు ఆన్‌లైన్‌లో చేసుకునేందుకు అవకాశం ఉంది.

వెబ్ ఆప్షన్ల నమోదులో అప్రమత్తత అవసరం

- వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు విద్యార్థులు ఇంట్లోని సొంత కంప్యూటర్‌తో పాటు ప్రైవేటు ఇంటర్‌నెట్ కేంద్రాలతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాల్లో సేవలను వినియోగించుకోవచ్చు.
- ఆప్షన్ల నమోదు ప్రక్రియలో విద్యార్థులు వివరాలను గోప్యంగా ఉంచుకోవాలి.
- హాల్ టికెట్ నంబరు, రిజిస్ట్రేషన్ ఐడీ, ఇతర కాన్ఫిడెన్షియల్ వివరాలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉంచకుండా జాగ్రత్తలు పాటించాలి.
- విద్యార్థులను చేర్చుకునేందుకు పలు ఇంజినీరింగ్ కళాశాలలు ఇప్పటికే తల్లిదండ్రులకు ఫోన్లు చేసి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. సర్టిఫికెట్లు తీసుకుని, తమ కళాశాలకు వస్తే గ్యారంటీగా సీటు వచ్చే విధంగా చూస్తామని సిబ్బంది ద్వారా ఫోన్లు చేయిస్తున్నాయి. ఇటువంటి ప్రలోభాలకు లొంగవద్దు.
- ర్యాంకు ఆధారంగా, నచ్చిన కళాశాలలతో పాటు బ్రాంచ్‌లకు ప్రాధాన్యత క్రమంలో ఆప్షన్లు నమోదు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

గత ఏడాది కటాఫ్ వివరాలు

ఏపీ ఈఏపీసెట్ సైట్‌లో అధికారులు గతేడాది కళాశాలల వారీగా ర్యాంకు, కటాఫ్ వివరాల జాబితా అందుబాటులో ఉంచారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో ర్యాంకులు, రిజర్వేషన్లు అనుసరించి 2024లో భర్తీ చేసిన సీట్ల వివరాలను పొందుపర్చారు. వీటి ద్వారా విద్యార్థులు ఒక అవగాహన వస్తుంది. ఏపీ ఈఏపీసెట్‌లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థుల్లో పలువురు జేఈఈ అడ్వాన్స్‌డ్ మెయిన్స్‌లోనూ జాతీయస్థాయిలో టాప్ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. వీరంతా ఐఐటీ, ఎన్ఐటీలకు వెళ్లిపోవడంతో పాటు రాష్ట్రంలోని ప్రైవేటు, డీమ్డ్ యూనివర్సిటీల్లోనూ ప్రవేశాలు పొందారు.

సీట్ల వివరాలు

- గుంటూరు, నరసరావుపేట, బాపట్ల జిల్లాల్లోని 36 ఇంజినీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో 30,240 సీట్లు ఉన్నాయి.
- రెండు ప్రభుత్వ కళాశాలల్లో 780 సీట్లు 34 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో 29,460 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- ఈఏపీ సెట్ ఇంజినీరింగ్ పరీక్షలో 23,536 మంది విద్యార్థులు అర్హత సాధించారు.

రేపటి నుంచి కార్మెల్ మాత ఉత్సవాలు



కార్మెల్ మాత దేవాలయం



కార్మెల్ మాత స్వరూపం

- పెద్దఎత్తున భక్తుల రాక
- ఏర్పాట్లు పూర్తి

ఫిరంగిపురం: స్థానిక కార్మెల్ కొండపై కొలువైఉన్న కార్మెల్ మాత ఉత్సవాలు ఈనెల 14,15,16వ తేదీల్లో నిర్వహించనున్నట్లు బాలఏసు దేవాలయ విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి శనివారం తెలిపారు. ఉత్సవాలకు గుంటూరు జిల్లా మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య హాజరై, సమష్టి దివ్య పూజాబలి పూజల్లో పాల్గొంటారని చెప్పారు.

- 14న ఉదయం 5.30 గంటలకు బాల ఏసు దేవాలయంలో దివ్యపూజాబలి నిర్వహిస్తామన్నారు. సాయంత్రం కార్మెల్ మాత కొండ వద్ద ఫాదర్లు వై. అంథోనిరాజు, పి.జోజిరాజుల ఆధ్వర్యంలో దివ్య పూజా బలి కార్యక్రమాలు ఉంటాయి.
- 15న ఉదయం 8 గంటలకు, 12 గంటలకు ఫాదర్లు ఫాతిమా మర్రెడ్డి, బి.మరియ పవన్ కుమార్ ఆధ్వర్యంలో కొండపై దివ్య పూజాబలి ఉంటుంది. మధ్యాహ్నం సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో అన్నదానం, సాయంత్రం 5గంటలకు దివ్య సత్ప్రసాద ప్రదక్షిణ, ఆరాధన ఉంటుంది. దివ్య సత్ప్రసాదం, కార్మెల్‌మాత స్వరూపంతో బాల ఏసు దేవాలయం నుంచి కార్మెల్ మాత కొండ వరకు ప్రదక్షిణ నిర్వహిస్తారు. అఖండ జపమాలను మరియ దళ సభ్యులు పఠిస్తారు.
- 16న ఉదయం 6 గంటలకు దివ్య పూజాబలి పూజలు, అనంతరం తేరు ప్రదక్షిణ ఉంటుంది.

భక్తులకు సకల సదుపాయాలు

కార్మెల్ మాత ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి తెలిపారు. నీటి సదుపాయం, రెండురోజుల పాటు అన్నదానం, విశ్రాంతి గదులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ఉత్సవాలకు భారీ బందోబస్తు

భక్తులకు అసౌకర్యం కలుగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ శివరామకృష్ణ తెలిపారు. సమీప స్టేషన్ల నుంచి 130 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని చెప్పారు. వాహనాలు పార్కింగ్ కోసం సెయింట్ పాల్స్ ప్లే గ్రౌండ్, మారినింగ్ స్టార్ కళాశాల గ్రౌండు, అల్లంవారిపాలెం రైల్వే గేటు సమీపంలో స్థలాలను ఎంపిక చేశామని చెప్పారు.

సుపరిపాలన కాదు.. అబద్ధాల పాలన

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు ధ్వజం
- అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలు చేయని సూపర్ సిక్స్
- మొదటి సంవత్సరం ఎగ్గొట్టి ఏడాది పూర్తయ్యాక తల్లికి వందనం



బాబు మోసాల మేనిఫెస్టో స్కానర్‌ను విడుదల చేస్తున్న అంబటి, మోదుగుల, వనమా బాల వజ్రబాబు, నాయకులు

తాడికొండ: చంద్రబాబు రాష్ట్రంలో చేస్తున్నది సుపరిపాలన కాదు.. అబద్ధాలు, మోసాల పాలన అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. తాడికొండలోని షిర్డీసాయి పర్తిసాయి మందిర కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిందని, సూపర్ సిక్స్ అమలు చేయలేక చేతులెత్తేసి నేతలంతా సొంత డబ్బా కొట్టుకుంటున్నారని మండిపడ్డారు. ఇది సుపరిపాలన కాదు.. మోసపు పరిపాలన అని ప్రజలకు చెప్పడమే బాబు 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమమని వివరించారు. ఒక్క సంవత్సరంలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. "రాజధానికి రెండో విడత 45 వేల ఎకరాలు కావాలంట.. అప్పట్లో 55 వేల ఎకరాలు సేకరించారు.. దుబాయ్, మలేషియా, సింగపూర్ అంటూ గొప్పలు చెప్పారు.. ఐదేళ్లు ఏమీ చేయలేదు.. అమరావతిలో ఇప్పుడు భూమి కొనేవాడు లేడు.. ముందు భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాల"ని రాంబాబు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫిరంగిపురం జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, తాడికొండ, తుళ్లూరు మేడికొండూరు మండలాల పార్టీ అధ్యక్షులు ముప్పాళ్ల మనోహర్, మైనేని శేషగిరిరావు, తాళ్లూరు వంశీ, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు దాసరి రాజు, తాడికొండ గ్రామపార్టీ అధ్యక్షుడు వంగా పోలారెడ్డి, వివిధ విభాగాల నాయకులు కల్లం హరికృష్ణారెడ్డి, చిట్టా అంజిరెడ్డి, మల్లంపాటి రాఘవరెడ్డి, ధూళిపాళ్ల నాగేశ్వరరావు, షేక్ అజీస్, షేక్ బాబావలి, పులి రమేష్, వడ్లమూడి రాజేంద్ర, నిమ్మగడ్డ ప్రసాద్, దెబోరా, కొప్పుల శేషగిరిరావు, చిన్నప్పరెడ్డి, అప్పిరెడ్డి, చేవూరి రామ్మోహనరెడ్డి, గుంటి రఘువరన్, షేక్ అబ్బాస్, అల్లు శ్రీనివాసరెడ్డి, షేక్ రబ్బాని, వలపర్ల కల్పన, కొదమల బుజ్జి, కోలేటి అనీల్, కొప్పుల శేషగిరిరావు, ఆళ్ల చిన్న హనుమంతరావు, చుండు వెంకటరెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే కార్యకర్తలకు ప్రాధాన్యం

పార్లమెంటు పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ మళ్ళీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ప్రథమ ప్రాముఖ్యత ఉంటుందని తెలిపారు. కష్ట కాలంలో తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీని పటిష్టపరిచే కార్యక్రమం భుజస్కంధాలపై వేసుకున్న దమ్మున్న నాయుడు వనమా బాల వజ్రబాబు అని అభినందించారు. పార్టీ కష్టకాలంలో ముందుకొచ్చి కార్యక్రమాల్లో భారీగా పాల్గొంటున్న కార్యకర్తలకు పాదాభివందనం అన్నారు. భవిష్యత్తులో అందరికీ ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

ఇంటింటికీ వస్తే నిలదీయండి !



నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు మాట్లాడుతూ లేనిపోని మాటలు చెప్పి ఇంటింటికీ తిరిగి అబద్ధపు హామీలిచ్చి ఓట్లేయించుకున్న చంద్రబాబు ఇప్పుడు సుపరిపాలన తొలి ఏడాది పేరుతో వస్తున్నారని తెలిపారు. టీడీపీ నేతలను నిలదీసి ఎగ్గొట్టిన పథకాలను ఎందుకివ్వలేదో ప్రజలు నిలదీయాలన్నారు. ఎన్ని అవాంతరాలు ఉన్నా సంక్షేమ పథకాల క్యాలెండర్ విడుదల చేసి మరీ ప్రజలకు నేరుగా ఖాతాల్లోకి అందించిన దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయితే ఇచ్చిన హామీలు ఎగ్గొట్టి మోసం చేసిన ఘనత చంద్రబాబుదని విమర్శించారు.

ఎన్‌సీసీ విద్యార్థుల నగదు స్వాహా

వ్యాయాయ ఉపాధ్యాయుడి నిర్వాకం

- స్కూలుకు వెళ్లి నిలదీసిన తల్లిదండ్రులు
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు, ప్రధానోపాధ్యాయుడు



యూనిఫాం లేదని చెబుతున్న వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు

పెదకాకాని: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విద్యకు గ్రహణం పట్టింది. కంచే చేను మేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. బదిలీపై వెళ్లిన వ్యాయాయ ఉపాధ్యాయుడు (పీఈటీ)ఎన్‌సీసీ విద్యార్థుల యూనిఫాం కాజేయడంతో పాటు వారి పేరున బ్యాంక్‌లో ఉన్న నగదు కూడా స్వాహా చేశాడు. అంతా తెలిసినా ఉన్నతాధికారులు గానీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గానీ చర్యలు తీసుకోక పోవడం శోచనీయం.

స్కూల్‌కు జిల్లాలోనే ప్రత్యేక స్థానం

మండలంలోని వెనిగండ్ల జెడ్పీ స్కూల్‌కు చదువుతో పాటు ఆటపాటలకు జిల్లాలోనే ప్రత్యేక స్థానం ఉంది. కొంతకాలంగా చదువులోనూ ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఇటీవల పీఈటీ ఉదంతంతో చెడ్డ పేరు కూడా వచ్చింది. వెనిగండ్ల స్కూల్ నుంచి నంబూరుకు బదిలీపై వెళ్లిన వ్యాయామోపాధ్యాయుడు మస్తాన్‌రెడ్డి యూనిఫాం కాజేయడంతో పాటు వారి పేరున బ్యాంక్‌లో ఉన్న నగదు కూడా స్వాహా చేశాడు. ఎన్‌సీసీ విద్యార్థుల తల్లిదండ్రులు నంబూరు వెళ్లి నిలదీయడంతో ఆయన దిగజారుడుతనం వెలుగుచూసింది.

పథకం ప్రకారం నగదు డ్రా

బదిలీపై వెళుతున్న మస్తాన్‌రెడ్డి పథకం ప్రకారం ఎన్‌సీసీ శిక్షణ పొందుతున్న జూనియర్లు 25 మంది, సీనియర్లు 25 మందిని బ్యాంక్ వద్దకు తీసుకు వెళ్లాడు. ప్రభుత్వం మంజూరు చేసిన నగదు వారి ఎకౌంట్ల నుంచి డ్రా చేయించి తీసేసుకున్నాడు. జూనియర్ల నుంచి రూ. 3,800, సీనియర్ల నుంచి రూ. 4400 చొప్పున మొత్తం 2 లక్షల రుపాయలకు పైగా స్వాహా చేశాడు. అంతే కాకుండా యూనిఫాం, బెల్ట్, టోపీ, షూ మొత్తం పట్టుకుపోయాడు. అంతటితో ఆగకుండా స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు 16 మంది నుంచి రూ. 500 చొప్పున వసూలు చేసుకున్నాడు. త్వరలో ఏ సర్టిఫికెట్స్ పొందే విద్యార్థులు ఫుల్ యూనిఫాంతో హాజరు కావాల్సి ఉంది.దాన్ని పీఈటీ తీసుకు వెళ్లాడని తెలుసుకున్న తల్లిదండ్రులు నంబూరు పాఠశాలకు వెళ్లి నిలదీశారు. స్కూల్‌కు సంబంధించిన ఆట వస్తువులు కూడా మాయమైనట్లు సమాచారం. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వివరణ కోరగా ఎన్‌సీసీ విద్యార్థుల వ్యవహారం తన దృష్టికి వచ్చిందని, అయితే విద్యార్థులు గానీ, తల్లిదండ్రులు గానీ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని, ఎన్‌సీసీ సర్టిఫికెట్లు మంజూరుకు ఆటంకం కలుగకుండా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు కోరుతున్నారు.

నేడు మన్నవ సర్పంచ్ నాగమల్లేశ్వరరావును పరామర్శించనున్న సజ్జల

చేబ్రోలు: పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రోద్బలంతో టీడీపీ గూండాల అమానుష దాడికి గురై గుంటూరులోని రమేష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పొన్నూరు రూరల్ మండలం మన్నవ గ్రామసర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావును ఆదివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పరామర్శించనున్నారు. ఈ మేరకు పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు జిల్లా నాయకులు, గుంటూరు పార్లమెంటు పరిధిలోని సమన్వయకర్తలు రానున్నట్లు అంబటి మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దళితులపై పెరిగిన దాడులు, దౌర్జన్యాలు

- హోం మంత్రి అనిత ఏం చేస్తున్నారు ?
- నాగమల్లేశ్వరరావును అంతం చేయాలని పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర ప్లాన్
- వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు ధ్వజం


నాగమల్లేశ్వరరావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు, అంబటి మురళీకృష్ణ

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్) : రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు జరుగుతుంటే.. కూటమి ప్రభుత్వంలో దళిత హోం మంత్రి అనిత ఏం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు ప్రశ్నించారు. కనీసం నోరెత్తి మాట్లాడలేని పరిస్థితుల్లో ఆమె ఉన్నారని విమర్శించారు. పొన్నూరు నియోజకవర్గం మన్నవ గ్రామంలో టీడీపీ గూండాలు దాడి చేయడంతో ప్రాణాపాయస్థితిలో గుంటూరు రమేష్ హాస్పటల్స్‌లో చికిత్స పొందుతున్న బొనిగల నాగమల్లేశ్వరరావును శనివారం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణతో కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి నాగమల్లేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు మాట్లాడుతూ మన్నవ గ్రామంలో వైఎస్సార్ సీపీకి ఉన్న ఆదరణ తట్టుకోలేక నాగమల్లేశ్వరరావును అంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ప్లాన్ చేశాడని ఆరోపించారు. టీడీపీ నేత బండ్లమూడి బాబూరావుతో హత్యాయత్నం చేయించింది నూటికి నూరుపాళ్లు ఆయనేనని ఆరోపించారు. ఇటీవల జరిగిన మినీ మహానాడులో ధూళిపాళ్ల వాళ్ల పార్టీ నేత బాబూరాబును రెచ్చగొట్టారని తెలిపారు. నాగమల్లేశ్వరరావును అంతం చేయకపోతే పక్కకు తప్పుకోండి.. సన్మానం చేసి మరి బయటకు పంపిస్తానని ధూళిపాళ్ల అనటంతోనే హత్యాయత్నం జరిగిందని వివరించారు.

హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న నరేంద్ర : అంబటి మురళీకృష్ణ

పొన్నూరు నియోజకవర్గంలో హత్యా రాజకీయాలను ధూళిపాళ్ళ నరేంద్ర తొలి నుంచి ప్రోత్రహిస్తున్నారని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ నిప్పులు చెరిగారు. దళితులంటే అసలు నరేంద్రకు అంత కడుపు మంట ఎందుకని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఎన్నో హత్యాకాండలు, ఆత్మహత్యలకు నరేంద్ర నిదర్శనాలు ఎన్నో ఉన్నాయని మండిపడ్డారు. దాడి కేసులో ఆయన్ను ఏ-1గా నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

డ్రైవర్లను అటెండర్లుగా మార్చడం అన్యాయం

ఏపీ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు


చిరంజీవిని సత్కరిస్తున్న శ్రీనివాసరావు, పాపారావు, కొండయ్య తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): వాణిజ్య పన్నుల శాఖలోని డ్రైవర్లను రివర్షన్ చేసి అటెండర్లుగా మార్చడం తీవ్ర అన్యాయమని, వారిని తిరిగి డ్రైవర్లుగా కొనసాగించాలని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం గుంటూరులోని జిల్లా సంఘ భవనంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ డ్రైవర్ల సంక్షేమానికి సంఘం తీవ్రంగా కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు పదవీ కాలం ముగిసినా చట్ట విరుద్ధంగా కొనసాగుతున్నారని, సభ్యత్వాన్ని రద్దు చేస్తూ సమావేశంలో తీర్మానం చేసినట్లు వెల్లడించారు. ఆయన ఇక సంఘంలో సభ్యుడు కాదని స్పష్టం చేశారు. అనంతరం పదవీ విరమణ చేసిన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవిని ఘనంగా సత్కరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డీఎస్. కొండయ్య, ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవి, రాష్ట్ర కోశాధికారి వి.పాపారావు, నాయకులు వై.నాగరాజు, అబ్దుల్ హమీద్, ప్రసన్నాంజనేయకుమార్, అప్పలనాయుడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక పత్రాల అందజేత


నియామక పత్రాలు అందుకున్న యువతీ, యువకులతో డీఆర్ఎం , అధికారులు

గుంటూరు రైల్వే డివిజన్‌లో 76 మందికి పంపిణీ

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో కేంద్ర ప్రభుత్వ రోజ్‌గార్ మేళాలో ఉద్యోగావకాశాలు పొందిన 76 మందికి ఆర్ఎం సుధేష్ట సేన్ నియామక పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. అరండల్‌పేటలోని రైల్ మహల్‌లో శనివారం 16వ రోజ్‌గార్ మేళా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ గుంటూరు, సికింద్రాబాద్, గుంతకల్ సహా 47 ప్రదేశాలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మేళాను ప్రారంభించారు. ఇందులో భాగంగా 76 మందికి డీఆర్ఎం సుధేష్ట సేన్ నియామక పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎం.రమేష్ కుమార్, సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్, సీనియర్ డీఎస్‌టీఈ రత్నాకర్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగురాలిపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడిని కోర్టుకు తీసుకెళుతున్న పోలీసులు

తెనాలి రూరల్: దివ్యాంగురాలిపై లైంగిక దాడికి పాల్పడి కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. తమిళనాడులోని తిరువన్నామలై జిల్లా వందవాసి మండలం పొదిరి గ్రామానికి చెందిన కొంతమంది 2022లో తెనాలి మండలం అంగలకుదురులో కూలి పనుల కోసం వచ్చి, కొన్ని రోజులు ఇక్కడ నివాసం ఉన్నారు. వీరితో వచ్చిన ఆరు గోపి అప్పట్లో మతిస్థిమితం లేని దివ్యాంగురాలైన 21 ఏళ్ల యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబసభ్యులు విషయం తెలుసుకుని పోలీసులను ఆశ్రయించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడు గోపి శిక్ష పడుతుందన్న భయంతో కోర్టు వాయిదాలకు రాకుండా తమిళనాడులో ఉంటున్నాడు. పోలీసులు అతడిని తమిళనాడు నుంచి తీసుకువచ్చి గుంటూరు కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 15 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడి ఆచూకీ గుర్తించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్ఐ డి. శ్రీనివాసరావు, ఏఎస్ఐ వెంకటరమణ, సీపీ సుబ్బారెడ్డిని పోలీసు అధికారులు అభినందించారు.

ఏడు మండలాల్లో మోస్తరు వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఏడు మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 20.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా చేబ్రోలు మండలంలో 1.2 మి.మీ. పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. పొన్నూరు మండలంలో 19.4 మి.మీ., కాకుమాను 18.6, పెదనందిపాడు 16.4, వట్టిచెరుకూరు 5, తుళ్లూరు మండలంలో 1.8 మి.మీ. చొప్పున వర్షం పడింది.

ప్రగతి పథంలో గ్రామీణ బ్యాంకులు

అఖిల భారత గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గోపిస్ ఉన్ని

కొరిటెపాడు(గుంటూరు): దేశవ్యాప్తంగా గ్రామీణ బ్యాంకుల విలీన ప్రక్రియ పూర్తయిన తర్వాత అవి ప్రగతి పథంలో నడుస్తున్నాయని అఖిల భారత గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం (బీఎంఎస్) అధ్యక్షులు గోపిస్ ఉన్ని పేర్కొన్నారు. స్థానిక ఎస్‌వీఎన్ కాలనీలో శనివారం గ్రామీణ బాంక్ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ బ్యాంకుల్లో పని చేస్తున్న ఉద్యోగుల కోసం బీఎంఎస్ అనుబంధ కార్మిక సంఘ ప్రారంభానికి సన్నాహక కమిటీ నియమించారని తెలిపారు. గ్రామీణ బ్యాంకుల్లో ఉద్యోగులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని సమర్థంగా తమ కార్మిక సంఘం కేంద్ర నాయకత్వానికి తీసుకువెళ్తుందని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ కలిపి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌గా అవతరించిందన్నారు. ఇది దేశంలోనే అతి పెద్ద బ్యాంకుగా ఉందని తెలిపారు. బీఎంఎస్ సంఘ ఉపాధ్యక్షుడు వెంగళరెడ్డి మాట్లాడుతూ భారతీయ మజ్దూర్ సంఘ అనుబంధంతో త్వరలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో సంఘాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. రిటైర్ అయిన వారందరికీ కూడా ఒక సంఘాన్ని ఆరంభిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో భారతీయ మజ్దూర్ సంఘ అనుబంధమైన గ్రామీణ బ్యాంకుల ఉద్యోగుల సంఘం కర్ణాటక ప్రతినిధి సతీష్ కుమార్, తెలంగాణ ప్రతినిధులు రమణారెడ్డి, శ్రీనివాసరాజు, రిటైర్ బ్యాంకు ఉద్యోగులు వెంకటేశ్వరరావు, విలాస్ రెడ్డి, డీసీ బాబు, డీవీఎస్ రాజు, ప్రసాదరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కొల్లిపర: వడ్డీ వ్యాపారి బూతులు తిట్టాడని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని తూములూరులో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. మండల పరిధిలోని తూములూరు గ్రామానికి చెందిన పెరికల దుర్గాప్రసాద్ (35) గ్రామానికి చెందిన వడ్డీ వ్యాపారి వద్ద కొంత సొమ్ము తీసుకున్నాడు. ఈ క్రమంలో వడ్డీ చెల్లించకపోవడంతో వ్యాపారి అతన్ని దూషించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వైద్యశాలకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ దుర్గాప్రసాద్ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.